
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024 | 5





ఊరంతా నీళ్లే: కిర్లంపూడి మండలంలో నీట మునిగిన రాజుపాలెం



ఉగ్ర గోదారి: కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద ఉధృతి

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద
దిగువకు 11,27,715 క్యూసెక్కులు విడుదల

తగ్గినట్టే తగ్గి.. పెరిగిన గోదారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : గోదావరి వరద పోటెత్తింది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి మహోగ్రరూపం దాల్చింది.కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ప్రమాదస్థాయికి చేరుకుంది. గోదావరి తీర ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రెండు రోజుల కిందట వరద తగ్గిందని ఊపిరిపీల్చుకునే లోపే గోదావరికి మరలా వరద పోటెత్తింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, ఉపనదులు పొంగి పొర్లుతున్నాయి. నదిలో వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో వరద తగ్గినట్టే తగ్గి ఒక్కసారిగా ఉధృతంగా పెరిగింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం రాత్రికి వరద నుంచి పూర్తిగా బయటపడిన స్నానఘట్టాలు 24 గంటల్లో మరలా వరద ప్రవాహం ముంచెత్తింది. మంగళవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు గోదావరి రివర్ కన్జర్వేటర్, హెడ్‌వర్క్స్ ఈఈ కె.కాశీ విశ్వేశ్వరరావు ప్రకటించారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు ఇక్కడ నీటిమట్టం 49.80 అడుగులుగా ఉంది.ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 11 గంటలకు నీటిమట్టం 12.80 అడుగులకు చేరడంతో 11,27,715 క్యూసెక్కుల వరదను 175 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.అది అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంకలను ముంచెత్తుతూ సముద్రంలోకి పోతోంది. గోదావరి పాండ్ లెవల్ 14.25 మీటర్లకు పెరిగింది. కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవారం నాటికి రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉందని వరద నీరు 12 లక్షల నుంచి 13 లక్షల క్యూసెక్కుల చేరే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. గోదావరి ఎగువ ప్రాంతాలైన భద్రాచలం, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి భారీ వరద వస్తుందని తెలిపారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళ వారం ఆమె క్షేత్రస్థాయి సమన్వయాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావొచ్చన్నారు. ముంపు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాజమహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లలో అత్యవసర పనులకు కార్యాచరణ సిద్ధం చేసి వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.రెండు డివిజన్లలో 6 పనులకు ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చారు. రాజమహేంద్రవరం, సీతానగరం, నిడదవోలు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో ముంపు ఎక్కువగా ఉంటుందని,అక్కడి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని జేసీ ఎస్.చిన రాముడు ఆదేశించారు. పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

జల వలయం

ముంచిన ఏలేరు.. ఉప్పొంగుతున్న గోదారి



వరదలో హై..వే: గొల్లప్రోలులో టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఉధృతంగా వెళుతున్న వరద నీళ్లు

- కాకినాడ జిల్లాలో ఏలేరు..కన్నీళ్లు
- 7 మండలాల్లో 62 గ్రామాలు మునక
- ఎక్కడికక్కడ కాలువలకు గండ్లు
- ఐదు మండలాల ప్రధానదారులు మూత
- నీట మునిగిన 45 వేల ఎకరాలు
- ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి
- రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద
- కోనసీమలో లంకలు మునక
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్



దారేది : పి.గన్నవరం మండలంలో కనకాయలంక కాజ్‌వేపై వరద

కోనసీమలో భయంభయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి) గోదావరి వరద ఉగ్ర రూపం దాల్చడంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. గోదావరి వరద ఉధృతి కారణంగా కోనసీమలోని గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ఠ వైనతేయ నదీపాయల్లో ప్రవాహ వేగం పెరుగుతోంది. ఇప్పటికే ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 7 గంటలకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో నదీపాయలన్నీ పొంగి పొర్లుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన చాకలిపాలెం కనకాయలంక కాజ్‌వే జలదిగ్బంధానికి గురైంది. సమీపంలోని లంక ప్రాంతాలను వరద ప్రవాహం ముంచెత్తుతోంది. నదీపాయలను ఆనుకుని ఉన్న కాజ్‌వేలు ముంపు బారిన పడడంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. వరద పెరుగుతున్నందున కొన్నిచోట్ల విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతోంది. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నారు. కుండలేశ్వరం సమీపంలో కుంగిన గట్టు వద్ద గడ్డర్లు ఏర్పాటుచేసి వాహనాలు వెళ్లకుండా అధికారులు నిరోధించారు. సముద్రపు మొగల వద్ద అలల ఉధృతి తీవ్రంగా ఉంది. ప్రధానమైన రేవుల్లో పరిస్థితిని బట్టి పంట్లు, పడవలపై రాకపోకలు సాగించాలని, వరద పెరిగితే తక్షణం నిలుపుదల చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులు ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అటు ప్రజలను, ఇటు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా రెండు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను కోనసీమ జిల్లాకు కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం 17 పాయింట్లలో జరుగుతున్న ప్రయాణికుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. పడవలపై ప్రయాణం చేయాలనుకునే వారికోసం లైఫ్ జాకెట్లు, గత ఈతగాళ్లను సిద్ధం చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ సమయంలో జి.పెదపూడి వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేయగా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే 44 ప్రాంతాల్లో పునరావాసాల్లో ఏర్పాటు చేయనున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి వెళ్లే కాజ్‌వే వద్ద పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. మరోవైపు గోదావరి నదీ పరివాహక లంక గ్రామాల్లోని విద్యా సంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. రాగల 72 గంటల పాటు అధికార యంత్రాంగం అప్రమత్తతతో పనిచేయాలని, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) ఎటుచూసినా వరద.. ఊళ్లన్నీ ఏరులై.. చేలన్నీ చెరువులై.. ఉదయం కనిపించిన రోడ్లు, ఇళ్లు మధ్యాహ్నానికి వరదలో మాయమయ్యేంత జల ప్రళయం.. జిల్లాలో ఏలేరు వరద మంగళవారం భయోత్పాతం సృష్టించింది. అంచనాలకు అందని జలవిలయంతో ముంచెత్తింది. దీంతో జిల్లాలో ఏడు మండలాల్లో 62 గ్రామాలు వరదలో చిక్కుకుని విలవిల్లాడాయి. 45 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నిండా మునిగాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచీ ఏలేరు వరద మరింత పోటెత్తడంతో పిఠాపురం, గొల్ల ప్రోలు, ఏలేశ్వరం, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, కొత్తపల్లి, సామర్లకోట మండలాల్లో వరద ముంపు భారీగా పెరిగింది. అనేక ప్రధాన రహదారులపై నీళ్లు పొంగుతూ ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. పిఠాపురంలోని రాపర్తి నుంచి గొల్లప్రోలు టోల్‌గేట్ మధ్యలో 216 జాతీయ రహదారిపై వరద నీరు చొచ్చుకొచ్చేసింది. దీంతో ఒకవైపు ప్రయాణాలు నిలిపివేశారు. దీనివల్ల భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఏలేరు నుంచి దిగువకు 42 వేల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల చేయడంతో వరద కాలువల్లో పోటెత్తి ఎక్కడికక్కడ గండ్లు పడి తీవ్ర నష్టంవాటిల్లింది. ప్రత్తిపాడు,కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం మండలాల ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండడంతో తాత్కాలికంగా మూసివేశారు. ముంపు గ్రామాలు విద్యుత్ లేక అంధకారంలో ఉన్నాయి.వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలకోసం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగం దిగాయి.

8 మండలాల్లో వరద ప్రభావం

- గొల్లప్రోలు మండలంలో ఏలేరు వరద నష్టం తీవ్రంగా ఉంది.ఏలేరు కాలువకు ఆరు చోట్ల గండ్లు పడడంతో 8,500 ఎకరాల్లో పంటలు,10 గ్రామాలు నీటమునిగాయి. గొల్లప్రోలు-తాటిపర్తి,చెందుర్తి-తాటిపర్తి రోడ్లు మూసివేశారు. వరద ఉధృతికి పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్లే దారిలో రాపర్తి నుంచి టోల్‌గేట్ వరకు వరద జాతీయ రహదారిపైకి వచ్చేసింది.ఈ దారిలో రాత్రి 8 గంటల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపియడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. గొల్లప్రోలు,పిఠాపురం శివారు ప్రాంతాల్లో అనేక కాలనీలను వరద ముంచడంతో బాధితులు ఆకలితో అలమటించారు.
- పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు 9 చోట్ల గండ్లు పడడంతో 14 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వరదనీరు ప్రధాన రహదారులపైకి వచ్చేయడంతో గొల్లప్రోలు-బి.ప్రత్తిపాడు,పిఠాపురం-రాపర్తి, పిఠాపురం- నరసింగపురం- జములపల్లి,పిఠాపురం-గోకివాడ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 15 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి.
- కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువకు మొత్తం పది చోట్ల గండ్లు పడడంతో 16 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మొత్తం 21 గ్రామాల్లో వరద చేరింది. రాజుపాలెంలో వందలాది కుటుంబాలు నరక యాతన పడుతున్నాయి.రాజుపాలెం-ముక్కోలు, గెద్దనాపల్లి- భూపాలపట్నం,భూపాలపట్నం-ఎస్.తిమ్మాపురం- బూరుగుపూడి, సోమరాయణపేట, పాలెం వరకు రాకపోకలు నిలిపివేశారు.
- ప్రత్తిపాడు మండలంలో ఏలేరు కాలువకు గండి పడడంతో 1,200 ఎకరాలు నీట మునిగింది.వరదలకు పెద్దిపాలెం, వేములపాలెం,ధర్మవరం, వెల్దుర్తి రహదారులు మునిగాయి. సుబ్బారెడ్డిసాగర్ కాలువలకు గతంలో పడ్డ గండ్లు తాజా వరదలతో మరింత ఎక్కువయ్యాయి.
- ఏలేశ్వరం మండలంలో 2,800 ఎకరాలు నీటమునిగాయి. ఎర్రవరం,తిరుమాలి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.
- పెద్దాపురం మండలంలో ఏలేరుకు ఒక చోట గండిపడి 4,300 ఎకరాలు నీటమునిగాయి.మర్లావ వరదలో చిక్కుకుంది.పెద్దాపురం నుంచి కాండ్రకోట రాకపోకలు నిలిపేశారు.
- సామర్లకోట మండలంలో ఏలేరు వరద కారణంగా పంట పొలాలు నీటమునిగాయి. టిడ్కో గృహాల వద్ద భారీగా వరద నీరు చేరింది. ఉప్పువారి సత్రం నుంచి జల్లూరు వరకూ 8 కి.మీ మేర వరదనీరు చేరింది. సామర్లకోట-పిఠాపురం మధ్య ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిపివేశారు.
- కొత్తపల్లి మండలంలో 800 ఎకరాల్లో పంట నీట మునిగింది.

అప్రమత్తంగా ఉండాలి

- 72 గంటల్లో వరద ఉధృతి పెరిగే ప్రమాదం
- అధికారుల సూచనలను లంక గ్రామాల ప్రజలు పాటించాలి
- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాగల 72 గంటల్లో గోదావరి వరద మహోగ్ర రూపం దాల్చే ప్రమాదం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అధికారులు సూచించే ఆదేశాలను లంక గ్రామాల ప్రజలు ఖచ్చితంగా పాటించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేసినట్టు చెప్పారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశం వరద పరిస్థితిపై మాట్లాడారు. గోదావరి పరివాహక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున ముఖ్యంగా శబరి నది ఉగ్రరూపం దాల్చడంతో అంచనాలకు అందని రీతిలో వరద గంటగంటకు పెరిగిపోతుందని చెప్పారు. గురువారం ఉదయానికి 13లక్షల క్యూసెక్కుల నీటిని దాటి రెండో ప్రమాద హెచ్చరికకు చేరువ అవుతుందన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక సమయంలో జి.పెదపూడిలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని, రెండో ప్రమాద హెచ్చరిక సమయంలో గోదావరి నది పరివాహక 44 లంక ప్రాంతాల్లో పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ చెప్పారు. నదీ పరివాహక ప్రాంతాల్లో 17 పాయింట్లలో పంట్లు, పడవలపై ప్రయాణాలపై ఆంక్షలు విధించినట్టు తెలిపారు. ఇక్కడ అధికారుల సూచనల మేరకు మోటారు బోట్‌లను ఏర్పాటుచేసి వాటిలో లైఫ్ జాకెట్లతో పాటు గజ ఈతగాళ్లను పెడుతున్నామన్నారు. వరద పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రధానమైన రేవుల్లో రాకపోకలపై నిషేధాలు అమలు చేస్తామని హెచ్చరించారు. రాగల 72 గంటల్లో వరద ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లాకు రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పిస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. లంక గ్రామాల్లో ఉన్న రైతులు అత్యవసమైతే అధికారుల సూచనలతో పడవలపై ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత లంక గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతున్నందున వారికి తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో ఉన్న వరద పరిస్థితులపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు సూచనలు చేశారు.

గణేష్ నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోండి..

ప్రస్తుతం గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో అధికారులుఎంపిక చేసిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జన కార్యక్రమాలు చేయాలన్నారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, పోలీసు బందోబస్తు, గజ ఈతగాళ్లను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. గోదావరి వరద ఉగ్రరూపం దాల్చుతున్నందున అధికారుల సూచనలు దాటి ఎవరూ గణేష్ నిమజ్జనాలను చేసేందుకు వెళ్లొద్దని సూచించారు. ప్రమాదకరమైన పరిస్థితులు గోదావరి నదుల్లో ఉన్నందున భక్తులు సహకారం అందించి గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంత పరిస్థితుల నడుమ జరుపుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు మాత్రమే బుధవారం సెలవుగా వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయని చెప్పారు. ప్రజలు మాత్రం అధికార యంత్రాంగానికి పూర్తిగా సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా

మెనూ మార్పు చేయాలి

మిడ్డే మీల్స్‌పై కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష



సమావేశానికి హాజరైన మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది..

కలెక్టర్ మహేష్


అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: విద్యార్థుల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకంమెనూలో మార్పులు చేయాల్సి ఉందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అందరితో చర్చించి అభిప్రాయాలు సేకరించి మధ్యాహ్న భోజన పథకం మెనూపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ స్థానిక అభిరుచులకు అనుగుణంగా ఉండాలని, దీనిపై అభిప్రాయాలు సేకరించి నివేదిక పంపాలని ప్రభుత్వాన్ని ఆదేశించినట్టు తెలిపారు. రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో వివిధ రకాల ఆహారపు అలవాట్లు ఉంటాయని, స్థానికంగా విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడే ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. న్యూట్రిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానికంగా దొరికే కూరగాయలు, పప్పులు తదితర వంటకాలను మెనూలో చేర్చాలన్నారు. రాష్ట్రమంతా ఒకే మెనూ అమలు చేయడం వల్ల కొందరు విద్యార్థులు అయిష్టంగానే మధ్యాహ్న భోజనం చేస్తున్నట్టు ప్రభుత్వం గుర్తించిందన్నారు. విద్యార్థులతో కూడా చర్చించాలని తెలిపారు. జిల్లాలో సుమారు లక్ష మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారని గుర్తించి అందరూ చర్చించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఈవో ఎం.కమలకుమారి, మార్కెటింగ్ శాఖ అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.



మామిడికుదురు: అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితి గురించి స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్



పి.గన్నవరం: కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి



'ఏలేరు' వరద ప్రభావిత ప్రాంతాల్లో నేడు సీఎం చంద్రబాబు పర్యటన

వార్త..7లో

కంట్రోల్ రూములు ఏర్పాటు

అమలాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేకంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. రెవెన్యూ డివిజన్ స్థాయితో పాటు కలెక్టరేట్‌లోను కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. అమలాపురంలోని కలెక్టరేట్ కంట్రోల్ రూము ఫోన్ నంబరు 08856 293104, అమలాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం సెల్ 8008803201, కొత్తపేట ఆర్డీవో కార్యాలయం ఫోన్ 08855 244299, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం కంట్రోల్ రూము ఫోన్ నంబరు 08857 245166లను ఏర్పాటు చేశారు.

రోల్ మోడల్‌గా పీఎంశ్రీలు

కెమిస్ట్రీ ల్యాబ్స్ మంజూరైన పాఠశాలలకు
రూ.15.58 లక్షలు విడుదల ● డీఈవో కమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో ఎంపికైన పాఠశాలలను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని జిల్లావిద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 21, రెండో విడతలో ఐదు పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అమలాపురం విద్యానిధి పాఠశాలలో మంగళవారం పీఎంశ్రీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలు, పాఠశాలల పరిధిలోని సర్పంచ్‌లు, ఎస్ఎంసీ చైర్మన్లతో ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎంశ్రీ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ ఫేజ్-1లో ఏడు పాఠశాలలకు కెమిస్ట్రీ ల్యాబ్స్ మంజూరు కాగా ఒక్కో పాఠశాలకు రూ.15.58 లక్షలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఆట స్థలాల అభివృద్ధిలో భాగంగా ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయని వివరించారు. అదే విధంగా జిల్లాలోని ప్రతీ పాఠశాలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.లక్ష చొప్పున యాన్యువల్ గ్రాంటు మంజూరైనట్టు చెప్పారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పీఎంశ్రీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్టు ఉప విద్యాశాఖాధికారులు శ్రీపాద నరసింహఫణి, సూర్యప్రకాశరావు తెలిపారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, సమగ్రశిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే భీమారావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అడబాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కేరళ వాయిద్య సందడి

వినాయకుడికి ప్రత్యేక పూజలు



అయినవిల్లి, సెప్టెంబరు 10: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. ఆలయం వద్ద కేరళ డప్పు వాయిద్యాల ప్రదర్శన ఆకట్టుకుంది. విఘ్నేశ్వరస్వామివారికి మాడ వీధి సేవ జరిపారు. పంచ హారతులు ఇచ్చారు. కొత్త విజయభాస్కరరావు, సావిత్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పులిహోర ప్రసాద వితరణ చేశారు. అమలాపురానికి చెందిన గణపతి స్వీట్ హౌస్, గణపతి గ్రూప్స్ వారిచే అన్నమయ్య లడ్డూలను వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చిరుతపులి జాడ కనబడలేదు!

- అటవీ ప్రాంతాన్ని ఆనుకుని హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల చెత్తాచెదారం
- పందుల సంచారంతో పులికి ఆహారం
- జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 10: చిరుతపులి జాడ సోమవారం రాత్రి ఏ ట్రాప్ కెమెరాల్లో చిక్కలేదని, దాని పాదముద్రలు కూడా గుర్తించబడలేదని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి తెలిపారు. చిరుతపులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకుగాని, పశువులకుగాని ఎటువంటి హాని జరగలేదని మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో మీడియాకు తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విధంగానే మంగళవారం కూడా చిరుతపులిని పట్టుకొనేందుకు అదనంగా బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతాల్లో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని చెప్పారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న నివాస ప్రాంతమైన హౌసింగ్‌బోర్డు కాలనీలోని గృహాల వద్ద నుంచి చెత్తను వేసి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారన్నారు. దీనివల్ల పందులు విపరీతంగా ఉండడంతో చిరుతపులికి ఆహారం సమృద్ధిగా లభిస్తోందన్నారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న నివాస ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద చెత్తను పక్కనే ఉన్న అడవిలో వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రఘునాథపురంలో దూడను చిరుతపులి చంపినట్టుగా వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన సమాచారంలో వాస్తవం లేదన్నారు. ఈ దూడ కనిన్ కుటుంబం (కుక్కలు, నక్కలు)కు చెందిన జంతువు దాడివల్ల చనిపోయిందన్నారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని కోరారు. నకిలీ సందేశాలకు పంపినవారిపై పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎస్పీ



గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపై భారీగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు

రహదారులన్నీ బంద్

- జాతీయరహదారిపై ఏలేరు వరద బీభత్సం
- రెండువైపులా భారీగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు.. రాకపోకలు నిలిపివేత

పిఠాపురం/గొల్లప్రోలు/కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: జాతీయ రహదారిపై ఏలేరు వరద బీభత్సం సృష్టించింది. కాకినాడ-కత్తిపూడి మధ్య 216వ జాతీయ రహదారిని విస్తరించి పునర్నిర్మించిన తర్వాత ఏలేరు వరద రహదారిపై ఇంత భారీస్థాయిలో రావడం ఇదే ప్రథమం. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ఆరుచోట్ల వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏలేరు కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతోపాటు భారీగా మిగులు జలాలను విడుదల చేయడంతో 216వ జాతీయరహదారి వరద నీటిలో చిక్కుకుంది. గొల్లప్రోలు టోల్‌గేటు సమీపంలో, ఇల్లింద్రాడ రైసుమిల్లు వద్ద, పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి జంక్షన్-చై జంక్షన్ మధ్యలో జాతీయరహదారికి రెండువైపులా ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. ఒకవైపు రెండున్నర నుంచి మూడున్నర అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుండడంతో పిఠాపురం-కత్తిపూడి మార్గంలో తొలుత వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను మోహరించారు. వరద ఉధృతికి ద్విచక్రవాహనదారులు, కార్లు, ఇతర చిన్నవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ఒకవైపు ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పిఠాపురం బైపాస్‌రోడ్డు రాపర్తి జంక్షన్ నుంచి టోల్‌గేటు మీదుగా గొల్లప్రోలు బైపాస్‌జంక్షన్ తాటిపర్తి రోడ్డు వరకూ ఒకవైపే వాహనాలను అనుమతించారు. వరద పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాకినాడ-కత్తిపూడి మధ్యగల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం బైపాస్‌రోడ్డు, గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద ఏలేరు వరద నీరు భారీగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి రెండు వైపుల నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఒక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం బైపాస్, గొల్లప్రోలు టోల్‌ప్లాజా, గొల్లప్రోలు బైపాస్‌రోడ్ల మీదుగా వాహనాలను అనుమతించడం లేదని, ఇక్కడ పోలీసు పహారా ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. అచ్చంపేట జంక్షన్, వాకలపూడి లైట్‌హౌస్ జంక్షన్, కత్తిపూడిల వద్ద నుంచే వాహనాలను దారిమళ్లిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు కూడా తెలియజేశారు. ఈ మళ్లింపును వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.


మళ్లింపు ఇలా...

- అచ్చంపేట జంక్షన్ నుంచి కత్తిపూడి వైపు వెళ్లే భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలను గొల్లప్రోలు టోల్‌ప్లాజా వైపు అనుమతించడం లేదు.
- వాకలపూడి, అచ్చంపేట జంక్షన్ నుంచి పిఠాపురం మీదుగా తుని, వైజాగ్ వైపు వెళ్లే వాహనాలను సామర్లకోట మీదుగా ఎన్‌హెచ్ 16 వైపు మళ్లిస్తున్నారు.
- కత్తిపూడి నుంచి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు కత్తిపూడి, జగ్గంపేట, రాజానగరం, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుకోవాలి.

నేడు సీఎం చంద్రబాబు రాక

పెద్దాపురం, సెప్టెంబరు10: సీఎం చంద్రబాబు బుధవారం ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం రాత్రి ఆర్డీవో జె.సీతారామారావుతో కలిసి పర్యవేక్షించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సామర్లకోట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. రోడ్డు మార్గాన 2.40 గంటలకు కిర్లంపూడి మండలం రాజుపాలెం చేరుకుని నీటమునిగిన గ్రామాలు, పంటలను పరిశీలించి బాధితులతో మాట్లాడతారు. 3.10 గంటలకు సామర్లకోట టీటీడీసీలో ఎగ్జిబిషన్‌ను సందర్శించి అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం 4.35కు విజయవాడకు బయలుదేరి వెళతారు.

గోదావరి ఉగ్రరూపం



కాటన్ బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 11 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి.. వరద పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


ధవళేశ్వరం, సెప్టెంబరు 10: భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాలు వల్ల ఇంద్రావతి నుంచి వరదనీరు, వాయుగుండం ప్రభావంతో ఒడిశా పరిసరాల్లో కురిసిన వర్షాలు వల్ల శబరి నది ఉధృతమై గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి పోటెత్తుతోంది. సోమవారం రాత్రి నుంచి పెరుగుతున్న నీటిమట్టం గంటకు ఒక్క పాయింట్ చొప్పున పెరుగుదల నమోదు చేసుకోగా మంగళవారం ఉదయం నుంచి మరింత ఉధృతమై గంటకు రెండు పాయింట్లు చొప్పున పెరిగిన నీటిమట్టం రాత్రి 7 గంటలకు 11.75 అడుగులకు చేరి 10,01,811 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండడంతో రివర్ కన్జర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఆపై పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 13 అడుగులుగా నమోదైంది. 11,55,027 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు. నీటిమట్టం మరింత పెరిగి బుధవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరికస్థాయి 13.75 అడుగులకు పెరగవచ్చని అధికారులు అంచనా. ఎగువన భద్రాచలం వద్ద పెరుగుదల వేగం మందగించడంతోపాటు శబరి ఉధృతి తగ్గడంతో ధవళేశ్వరం వద్ద 15 లక్షల క్యూసెక్కుల వరకు వరద రావచ్చని అంచనా. కాగా భద్రాచలం వద్ద వేగంగా పెరుగుతున్న నీటిమట్టం మంగళవారం ఉదయం 9 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికస్థాయి దాటి ప్రవహించగా సాయంత్రం 5గంటలకు 48.20 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 49.80 అడుగులకు చేరుకుంది. కాగా ఎగువన కాళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 8.60 మీటర్లుగా నమోదుకాగా, పేరూరు వద్ద 17.33 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.50 మీటర్లు, భద్రాచలం వద్ద 48.60 అడుగులు, కూనవరం వద్ద 20.28 మీటర్లు, కుంట వద్ద 15.13మీటర్లు, పోలవరం వద్ద 12.52మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 15.82 మీటర్లుగా నమోదైంది. కాగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ కాటన్ బ్యారేజీ పైనుంచి పరిశీలించారు. నీటిమట్టం కొలిచే సూచీలు ఉన్న ప్రాంతంలో నీటి మట్టాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చెప్పారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో రేవుల వద్దకు ప్రజలను అనుమతించబోమని, ఉత్సవ కమిటీకి చెందిన కొందరిని మాత్రమే అనుమతిస్తామన్నారు. వీరి వెంట ధవళేశ్వరం సీఐ గణేష్, ఇరిగేషన్ ఇంజనీర్లు నాగలక్ష్మి, ఎ.సాయిరాం తదితరులున్నారు.



ఏలేరు వరదలో చిక్కుకున్న ముగ్గురు యువకులు

సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన స్థానికులు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 10: ఏలేరు వరదలో ముగ్గురు యువకులు చిక్కుకున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం రాపర్తి గ్రామానికి చెందిన తొమ్మిది మంది యువకులు గొర్రిఖండి వద్ద వరద నీటిని చూసేందుకు వెళ్లారు. అక్కడ వరద నీటిలో దిగగా ప్రవాహానికి చిక్కుకున్నారు. ఆరుగురు యువకులు గట్టుపై నుంచి జముల పల్లికి సురక్షితంగా చేరుకున్నారు. అయితే ఎస్.శివ, దుర్గాప్రసాద్, బి.శివలు మాత్రం వరదనీటిలో చిక్కుకుపోయారు. దీనితో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఈలోగానే స్థానికులు వారిని సురక్షితంగా కాపాడి బయటకు తీసుకువచ్చారు. ఆర్డీవో ఇట్ల కిషోర్ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల విరాళం అందిస్తున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

వరద బాధితులకు 'తిరుమల' రూ.50 లక్షల విరాళం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి చెక్‌ను అందించారు. అలాగే బాధితులకు తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 25 వేల ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు పంపించామని తిరుమలరావు తెలిపారు. ఆయనను చంద్రబాబు అభినందించారు.



వరద బాధితుల కోసం డిప్యూటీ సీఎం పవన్‌కు సురుచి ఫుడ్స్ అధినేత మల్లిబాబు రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు 'సురుచి' రూ.20 లక్షల విరాళం

మండపేట, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) రూ.20 లక్షల చెక్కును ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు మంగళవారం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న తమ ఏడు స్వీట్‌స్టాల్స్ ద్వారా ఆదివారం అమ్మకాల ద్వారా వచ్చిన రూ16.90 లక్షలు, సంస్థ సిబ్బంది 600 మంది ఒక రోజు వేతనం రూ2.36 లక్షలతోపాటు తాను కొంత కలిపి మొత్తం రూ.20 లక్షల చెక్కును సీఎం సహాయనిధికి అందించినట్లు మల్లిబాబు పవన్‌కు వివరించారు. తాపేశ్వరం సురుచి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను మల్లిబాబు పవన్‌కు వివరించారు. దీంతో పవన్ ఆయనను అభినందించారు. కేరళ తుపాను బాధితులకు అందించిన సాయం గురించి మల్లిబాబు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మల్లిబాబు సత్కరించి, ఐదు కిలోల లడ్డూను పవన్‌కు బహూకరించారు. ఆయన వెంట సురుచి పీఆర్వో వర్మ ఉన్నారు.

కోరుకొండ ఆలయం ఆదాయంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల గోల్‌మాల్

- రూ.15 లక్షల వరకు ఖజానాకు కన్నంపెట్టినట్టు ఆరోపణలు
- ఈవో సీరియస్

అన్నవరం, సెప్టెంబరు 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఒక విభాగంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నవరం దత్తత దేవాలయం అయిన కోరుకొండ లక్ష్మీనరసింహ ఆలయంలో ఏడాది కాలంలో వివిధ పద్దుల కింద సుమారు 15 లక్షలు ఆదాయం రాగా అక్కడ ఆదాయం ఇక్కడ చూపించకుండా ఖర్చులు మాత్రమే అన్నవరం దేవస్థానం నుంచి చూపించారు. అక్కడ ఆదాయం చూపకుండా ఖర్చులు మాత్రమే చూపుతుండడం దీనిపై పంపకాలలో తేడా రావడంతో విషయం బయటపడింది. ఈవో రామచంద్రమోహన్ ఈ అంశంపై సిబ్బందిపై ఫైర్ అయ్యారు. తక్షణమే పూర్తి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. లేకుండా సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్టు చెబుతున్నారు. కోరుకొండ ఆలయ ఆదాయవ్యయాలను లీజుల విభాగ అధికారులు చూస్తుండడం పంపకాలలో తేడా రావడంతో విషయం బయటకి పొక్కింది. కోరుకొండ ఆలయం దత్తత తీసుకుని 10 ఏళ్లు అవుతుండగా ఏడాదిలో ఇంత గోల్‌మాల్ జరగగా గతంలో జరిగిన లావాదేవీలపై విచారణ జరిపితే మరింత పెరుగుతుందని అంటున్నారు.

సత్యదేవుడి విమానగోపురం బంగారు తాపడానికి మరోసారి అంచనాలు

అన్నవరం, సెప్టెంబరు 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమానగోపురానికి బంగారుతాపడం చేయించాలనే ప్రతిపాదనకు దేవదాయ కమిషనర్ ఆదేశాలతో టీటీడీ రూ.99 కోట్లు వ్యయం అవుతుందని అంచనావేయగా, దీన్ని మరోసారి అంచనా వేయించాలని దేవస్థానం అధికారులు కోరారు. గతంలో ఒకసారి దేవదాయశాఖ స్థపతి అంచనా సుమారు 12 కోట్లు వేయగా టీటీడీ జ్యూయలరీ విభాగ అంచనా వ్యయం భారీగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికిగాను 114 కిలోల బంగారం వినియోగించాల్సి ఉంటుందని అంచనా వేశారు. గతంలో 40 కిలోల బంగారం పడుతుందని దేవదాయశాఖ స్థపతి అంచనా వేశారు. కాగా రత్నగిరివాసుడైన సత్యదేవుడిని ప్రధానాలయంలో భక్తులు దర్శించుకునే విధానం పాతవిధానంలో అమలుచేయాలని ఈవో రామచంద్రమోహన్ ఆదేశించారు. గతంలో ప్రధానలయంలోకి ఉత్తరదిక్కుకు ప్రవేశించి మూలవరులను దర్శించుకుని దక్షిణమార్గం ద్వారా వచ్చేవారు. పూర్వపు ఈవో ఆజాద్ ప్రదక్షిణ దర్శనం ప్రవేశపెట్టి రూ.300 టిక్కెట్టు నిర్ణయించారు. రద్దీ రోజుల్లో ఈ విధానం వల్ల భక్తులకు ఇబ్బంది కలిగి దర్శనం ఆలస్యం అవుతుండడంతో ఈవో పాత విధానం అమలుచేయాలని ఆదేశించారు.

కండివాగులో పడి మహిళ మృతి



కోటనందూరు, సెప్టెంబరు 10: కాకినాడ జిల్లా కోటనందూరు మండల కే.కొత్తూం గ్రామంలో కండువాడు ఉధృతికి మహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోటిమిల్లి తులుపులమ్మ రజకత్వం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజూలాగే కండువాగులో దుస్తులు ఉతికేందుకు దిగి బళ్ల వద్దకు వెళ్తుండగా వరదప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కొట్టుకుపోయింది. స్థానికులు గుర్తించి మహిళను బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు10: రాజమహేంద్రవరంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల ఫైనల్స్ బుధవారం జరుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెమీ ఫైనల్ మ్యాచ్‌లు, మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. మంగళవారం మెన్స్ సింగిల్స్, ఉమెన్ సింగిల్స్, ఉమెన్ డబుల్స్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి.





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్.. (పక్కన) చోరీ సొత్తు

పగలు రెక్కీ చేసి.. రాత్రికి దోచేస్తారు!

- తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న నలుగురు నిందితుల అరెస్టు
- రూ.94.70 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- తొలుత చిరువ్యాపారులు.. సులువుగా డబ్బుల కోసం దొంగతనాల్లోకి
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: ఆ నలుగురు పగలు రెక్కీ చేశారంటే.. రాత్రికి ఆ ఇల్లు దోచుకుంటారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో రాత్రిపూట యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.94 లక్షల70వేల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో నిఘాను పటిష్ఠం చేసి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ఈక్రమంలో సోమవారం రాత్రి క్రైం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కాకినాడ రూరల్ మండలం సర్పవరం భవనారాయణస్వామి గుడి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారిని కాకినాడ డెయిరీఫారం సెంటర్ బాలవెంకట్‌నగర్‌కు చెందిన టేకుమూడి శ్రీకాంత్, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గైగోలుపాడు రాజేంద్రనగర్‌కు చెందిన పాత నేరస్తుడు వల్లి లక్ష్మణ్‌కుమార్, అతడి అన్నయ్య వల్లి రాంకుమార్, ధవళేశ్వరానికి చెందిన పాత నేరస్తుడు మెండి మహేశ్వరదుర్గాప్రసాద్‌గా గుర్తించారు. గతంలో వీరు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్నారు. ఈ క్రమంలో టేకుమూడి శ్రీకాంత్, వల్లి లక్ష్మణ్‌కుమార్ కలిసి కాకినాడ నగరం, ఇంద్రపాలెం, సామర్లకోట, తిమ్మాపురం, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో ఇళ్లలోకి దూకి తలుపులు తాళాలు బద్దలకొట్టి దొంగతనాలను చేసేవారు. దొంగిలించిన సొత్తును లక్ష్మణ్‌కు అన్నయ్య అయిన రాంకుమార్ ద్వారా అతడి స్నేహితుడైన మెండి మహేశ్వరదుర్గాప్రసాద్‌ను సంప్రదించి.. అతడి ద్వారా గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి ఆ సొమ్మును జల్సా చేసేవారని ఎస్పీ వెల్లడించారు. శ్రీకాంత్, లక్ష్మణ్‌కుమార్ మొత్తంగా 21 ఇళ్లల్లో నేరాలకు పాల్పడి రూ.1కోటి44లక్షల 24వేల విలువైన చోరీసొత్తును కొల్లగొట్టి కొంత సొమ్ము జల్సా చేశారని తెలిపారు. నిందితుల నుంచి రూ.84 లక్షల విలువైన 1200 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.9.90 లక్షల విలువైన 11 కిలోల వెండి వస్తువులను, నేరాలకు వినియోగించేందుకు ఉపయోగించిన రూ.80 వేల విలువైన మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నేరస్తులను చాకచక్యంగా పట్టుకోవడంలో విశేష కృషిచేసిన కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీడీఎస్పీ సీహెచ్ శ్రీరామ కోటేశ్వరరావు, సర్పవరం సీఐ పెద్దిరాజు, క్రైం సీఐ వి.కృష్ణ, ఎస్ఐలు రామకృష్ణ, వినయ్‌ప్రతాప్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, హెచ్‌సీలు గొప్పు సత్తిబాబు, గొప్పు చిన్న, పీసీలు మౌళి, నాయుడు, స్వామిలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎన్‌జేపీ భాస్కర్‌రావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు, ఎస్‌బీడీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అటు వరద గోదావరి ఇటు శబరి దూకుడు!

ఏజెన్సీ విలీన మండలాల్లో ముంచెత్తిన వరద.. నిలిచిపోయిన రాకపోకలు



చింతూరు మండలం చట్టి వద్ద ఏపీ - ఛత్తీస్‌గఢ్ 30వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



చింతూరు మండలం ముకునూరు వద్ద సోకిలేరు వాగు దాటించి రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న బాధితులు

చింతూరు, సెప్టెంబరు 10 : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. శబరి, సీలేరు నదులతో పాటు సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 22 గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గంటగంటకు పెరుగుతున్న వరద లోతట్టు వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. పోలవరం బ్యాక్ వాటర్ కారణంగానే తమకు ఏటా వరద సమస్య వస్తోందని బాధితులు వాపోతున్నారు. తమకు పరిహారం ఇచ్చి పునరావాస కేంద్రాలకు తరలించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చింతూరు ఒడ్డు వాసులు మంగళవారం వరద నీటిలో దర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వారి వద్దకు వెళ్లి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాగా మంగళవారం పెద్దసీతనపల్లి, నర్సింగపేట తదితర ముంపు ప్రభావిత గ్రామాలకు చెందిన రోగులను ముకునూరు వద్ద నాటు పడవ దాటించి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కల్లేరు ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులను జాలర్ల పడవల ద్వారా దాటించి వారి వారి ఇళ్లకు చేర్చారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 44 అడుగుల వద్ద భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగుల వద్ద ప్రవహిస్తుండడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల నడుమ 326, 30వ నెంబరు జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయి చట్టి వద్ద వాహనాలు నిలిచిపోయాయి.





భద్రాచలం-కూనవరం మధ్యలో రహదారిపై చేరిన వరదనీరు.. ఇంట్లో సామగ్రి పట్టుకుని పునరావాస కేంద్రాలకు వెళ్తున్న ప్రజలు

కూనవరంలో జలదిగ్బంధం.. రాకపోకలన్నీ బంద్

కూనవరం, సెప్టెంబరు 10: కూనవరం మండలంలోని వరద ప్రభావంతో అన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-కూనవరంకు పూర్తిగా సంబంధాలు తెగిపోగా, మండలంలోని అన్ని గ్రామాల రహదారులపై వరద వచ్చి చేరింది. ఇప్పటికే పాఠశాలలు మూతపడగా మూడు రోజుల నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈసారి వరదకు శబరి దూకుడు పెంచింది. కూనవరంలో శబరి గోదావరి సంగమం కావడంతో ఆ ప్రదేశం సముద్రంగా కనిపిస్తోంది. అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించేందుకు లాంచీలు సిద్ధం చేశారు. గిన్నెల బజార్, ఉదయభాస్కర్ కాలనీతోపాటు శబరికొత్తగూడెం తదితర గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రచారం నిర్వహించారు. శబరి గోదావరి సంగమం వద్ద ఉన్న శబరి బ్రిడ్జిని తాకి ఉధృతంగా ప్రవహిస్తోంది.

వీఆర్ పురం మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు బంద్

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 10: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వరరామచంద్రపురం మండలంలోని ప్రధాన రహదారులపై వరదనీరు చేరుకోవడంతో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్య వరద నీరు రోడ్డుపై చేరుకుంది. శ్రీరామగిరి గ్రామంలో వరదనీరు ఇళ్లలోకి చేరుకోవడంతో గ్రామస్తులు గుట్టపై నిర్మించుకున్న పునరావాస కేంద్రాల్లోకి సామాన్లతో చేరుకుంటున్నారు. అటు వెంకంపాలెం, చింతరేవుపల్లి, తుష్టివారిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, సోములగూడెం గ్రామాల మధ్యలోగల చింతూరు వెళ్లే ప్రధాన రహదారిపై వరదనీరు చేరుకుంది. వరదల నేపథ్యంలో ప్రభుత్వం అందించిన దోమతెరలు, కందిపప్పు, నూనెను తహశీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి బాధితులకు పంపిణీ చేశారు.

విజయవాడ వరద బాధితులకు రూ.లక్ష విరాళం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు అనాతవరానికి చెందిన విశ్రాంత పోలీసు ఉద్యోగి, కడలి సేవా ట్రస్టు ప్రతినిధి కడలి శ్యామ్‌బెనగల్ ముఖ్యమంత్రి సహాయనిధికి మంగళవారం రూ.50 వేల విరాళం చెక్కును కలెక్టర్‌కు కలెక్టరేట్‌లో అందజేశారు. కడలి సేవా ట్రస్టు బృంద సభ్యులను కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా గణేష్ కిరాణా కుప్పాల బ్రదర్స్ రూ.50వేల విరాళం చెక్కును కె.వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు అందజేయగా కుప్పాల బ్రదర్స్‌ను ఆయన అభినందించారు.

లంక గ్రామాలకు మళ్లీ వరద పోటు!

● నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే
● పెరుగుతున్న వరద ఉధృతి


అలమూరు: జొన్నాడ వద్ద గోదావరి వరద ఉధృతికి మునిగిన పుష్కర్ ఘాట్

పి.గన్నవరం, సెప్టెంబరు10: గోదావరికి మళ్లీ వరద పోటు వచ్చింది. దీంతోఈసీజన్‌లో మూడోసారి వరద నీరు లంక గ్రామాలను తాకింది. ఇప్పటికే వరదలకు లంకల్లో కూరగాయలు, వాణిజ్య పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ఎగువన గోదావరికి వరద ఉధృతి గంట గంటకు పెరుగుతుండటంతో దిగువన ధవళేశ్వరం వద్ద వరద పొంగి ప్రవహిస్తుంది. దీంతో సముద్రంలోకి నీటిని భారీగా విడుదల చేయడంతో కోనసీమ జిల్లాలోని నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై మూడోసారి వరదనీరు తాకింది. సోమవారం తేరుకున్న కాజ్‌వే మంగళవారం మళ్లీ మునిగింది. దీంతో లంకగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు కాజ్‌వే వద్ద రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంకగ్రామాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా లంకగ్రామాల ప్రజలు ఇంకా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నదీపాయ వద్ద సేవలు అందిస్తున్నారు.

పడవ దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి: ఆర్డీవో

గంటిపెదపూడి శివారు బూరుగులంక రేవు వద్ద పడవ దాటే సమయంలో నిబంధనలు పాటించాలని ఆర్డీవో జి.వి.వి.సత్యనారాయణ పడవలు దాటించే వారికి, అధికార సిబ్బందికి సూచించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. మానేపల్లి శివారు శివాయిలంకలో ఆర్డీవో పర్యటించి స్థానికులకు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ పి.శ్రీపల్లవి, వీఆర్వోలు ఉన్నారు.

చెరువులకు జల కళ

మండపేట, సెప్టెంబరు10: కేశవరం, ద్వారపూడి గ్రామాల్లో ఉన్న మైనర్ ఇరిగేషన్ చెరువులకు భారీ వర్షాలతో జల కళ వచ్చింది. కురుస్తున్న భారీ వర్షాలకు కేశవరంలోని గనిపోతురాజు చెరువు, ద్వారపూడిలోని పంగిడి చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి. వీటి ద్వారా సమీపంలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. చెరువులు నిండుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

అలమూరు, సెప్టెంబరు 10: గోదావరి ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు గోదావరి వరద ఉధృతి క్రమక్రమంగా పెరుగుతోంది. వరద ఉధృతి పెరుగుతుండటంతో మండలంలో లంక రైతుల్లో ఆందోళన మొదలైంది. గోదావరి మాత మరోసారి ఉగ్రరూపం దాల్చితే తీవ్రంగా నష్టపోతామని వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, అలమూరు గ్రామాల పరిధిలోని లంక భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. జూలై నెలలోనే వరదలు రావడంతో ఈసారి వరదలు అంతగా రావనే ఉద్దేశంతో రైతులు కూరగాయలతో పాటు వాణిజ్య పంటల సాగుకు ఉపక్రమించారు. జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కర్‌ఘాట్‌తో పాటు అక్కడ ఉన్న ఆలయాల వద్దకు వరద నీరు చేరింది.

లంక గ్రామాల ప్రజలు బెంబేలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 10: గోదావరి వరద క్రమక్రమంగా ఉధృతి పెరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. మంగళవారం నదీపరివాహక ప్రాంతాలు కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి గ్రామాలతో పాటు కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. లంక పొలాల్లోకి నీరు చేరింది. గోదావరి నదిని ఆనుకుని లంక గ్రామాల్లో ఇటుకబట్టీలు ఉండటంతో పలువురు బట్టీయజమానులు నదీసమీపంలో 10నుంచి 20మీటర్ల లోతులో మట్టిని తవ్వితరలించుకుపోతున్నారు. దీంతో నదిని ఆనుకుని ఉన్న లంకభూములు కోతకు గురై గోదావరి నదిలో కలిసిపోతున్నాయి. దీనికారణంగా లంకగ్రామాలకు వరద ఉధృతి పెరిగితే గ్రామాలే కనుమరుగయ్యే అవకాశం ఉందని భయాందోళనలు చెందుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

మండపేట, సెప్టెంబరు 10: ద్వారపూడిలో ప్రజల ఆమోదంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. ద్వారపూడి వచ్చిన ఆయన మంగళవారం సర్పంచ్ ఈతకోట కిన్నెర, స్థానిక దళిత నేతలతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై స్థానికులతో కలిసి కలెక్టర్‌ను త్వరలో కలుస్తామన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి మీనా, ఎస్సీ సెల్ నాయకుడు యండ్ల రాజేష్ తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వాలి

రాజోలు, సెప్టెంబరు 10: ఎంపీటీసీలకు 12నెలల నుంచి గౌరవ వేతనం అందలేదని, తక్షణమే వారికి గౌరవ వేతనం అందజేయాలని ఎంపీపీ కేతా శ్రీను అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మంగళవారం కలెక్టర్ మహేష్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీపీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గుత్తుల శ్రీను, పి.కృష్ణ పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయ భూములను పరిరక్షించాలి

అంతర్వేది, సెప్టెంబరు 10: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ భూముల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుంది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యవేణలో భాగంగా ఏపీ అర్బన్ చీఫ్ టెక్నికల్ అధికారి లక్ష్మీనారాయణ, డివిజనల్ అధికారి సిద్ధార్థలతో ఎమ్మెల్యే దేవ సుదీర్ఘ చర్చలు జరిపారు. అంతర్వేది ఆలయ పరిసరాలతో పాటు లైట్‌హౌస్, సాగర సంగమం ఉన్న భూములను, భక్తుల వసతి గదులు ఏర్పాటుచేసే స్థలాలను ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ అంతర్వేది వచ్చిన ప్రత్యేకబృందానికి చూపించారు. జనసేన నియోజకవర్గ నాయకులు గుండుబోగుల పెద్దకాపు, మండలఅధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, పోతాబత్తుల రాంబాబు, చాగంటి స్వామి, ఆలయ సిబ్బందిపాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి

రావులపాలెం, సెప్టెంబరు 10: పాఠశాలలో చదివే విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఎస్‌ఐ చంటి అన్నారు. రావులపాలెం నారాయణ విద్యా సంస్థల్లో ప్రిన్సిపాల్ రమణబాబు ఆధ్వర్యంలో క్యాబినెట్ ఇన్వెస్ట్ ట్యూబ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్‌ఐ చంటి, విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు సూచనలు చేశారు.

జాతీయ కవితా పోటీల్లో సుబ్బారావు ప్రతిభ



కొత్తపేట, సెప్టెంబరు 10: సాహిత్య సాంస్కృతిక సామాన్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ స్థాయిలో తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే శీర్షికతో కవితా పోటీలు నిర్వహించింది. ఈపోటీల్లో 400మందికిపైగా కవులు పోటీ పడగా వారిలో కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ సుబ్బారావు మొదటి పది స్థానాల్లో ఒకరిగా నిలిచారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సుబ్బారావుకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. సుబ్బారావును ప్రముఖ కవులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కొల్లి రమాదేవి, జి.ఈశ్వరిభూషణం, చిట్టే లలిత, నూకా సంపత్, నల్లా భాగ్యలక్ష్మి, డీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి అభినందించారు.

సెక్యూరిటీ సూపర్‌వైజర్ నిజాయితీ

దొరికిన రెండు కాసుల బంగారం చైన్ అందజేత

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 10: ఏరియా ఆసుపత్రిలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ పలివెల శ్రీను నిజాయతీగా వ్యవహరించి పలువురి అభినందలు పొందాడు. మంగళవారం ఆసుపత్రి విధుల్లో ఉన్న శ్రీనుకు రెండు కాసులు చైను దొరికింది. దీంతో శ్రీను చైను ఏరియా ఆసుపత్రి పర్యవేక్షుడు డాక్టర్ ప్రవీణ్‌కు అందజేశారు. డాక్టర్ ప్రవీణ్ ఆ చైన్‌ను పోలీసులకు అందించారు. కొద్దిసేపటికి కవలవారి సావరానికి చెందిన రైల్వే పోలీసు పి.సతీష్‌కుమార్‌చైను పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో చైన్ వేసుకున్న ఫొటోలు, తూకం వివరాలు సతీష్ పోలీసులకు చూపించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్టేషన్ రైటర్ మల్లికార్జునరావు చైన్‌ను సతీష్‌కు అప్పగించారు.

బస్సులు అందించేందుకు బ్యాంకు అంగీకారం

ఆత్రేయపురం, సెప్టెంబరు10: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రెండు ఉచిత బస్సులు అందించేందుకు యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు అంగీకరించినట్లు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

ఓబీసీ కులగణనపై మల్లాడి హర్షం

యానాం, సెప్టెంబరు 10: ఓబీసీ కుల గణనకు తెలంగాణ హైకోర్టు ఆమోదం తెలపడంపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, బీసీ ఫెడరేషన్ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. మూడు నెలల్లో ప్రక్రియను పూర్తిచేయాలని హైకోర్టుఉత్తర్వులు జారీ చేసింది. ఈప్రక్రియను ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో చేపట్టాలని ముఖ్యమంత్రులను కోరతానని మల్లాడి అన్నారు.

క్రీడాకారిణి బిందుశ్రీకి సత్కారం

యానాం, సెప్టెంబరు10: స్పోర్ట్స్ కోటాలో తమిళనాడులోని పీఎస్ఎన్ఏ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో ఉచితసీటు సాధించిన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణి బిందుశ్రీని యానాంబాల్‌బ్యాడ్మింటన్ సభ్యులు సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగా ఆదర్శ్ షసుమాన్‌మాట్లాడుతూ బిందుశ్రీకి స్పోర్ట్స్ కోటాలో సీటు రావడం క్లబ్‌కు గర్వకారణమన్నారు. కోచ్ బొట్టా శ్రీనివాస్, రాయపురెడ్డి విజయ్, పెనుమత్స అజయ్‌రెడ్డి, రెడ్డి లోవన రేష్, వీరబాబు, ప్రేమ్, శాంతి పాల్గొన్నారు.

గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 10: గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన్నట్లు ఎంపీడీవో నాతి బుజ్జి పేర్కొన్నారు. బొబ్బర్లంక, వసంతవాడ, వాడపల్లి, తాడిపూడి, పులిదిండి కార్యదర్శులకు ఈహోదా కల్పించినట్లు చెప్పారు. గ్రామ పరిపాలనలో వారి బాధ్యతలు, విధులు, జవాబుదారీతనం, నిధుల వినియోగం తదితర అంశాలపై ఎంపీడీవో సూచనలు అందజేశారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 10: అంతర్వేదిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీవో వై.రమాదేవి, సూపర్‌వైజర్ ఆర్.విజయభారతి పాల్గొని బాలింతలు, గర్భిణులకు ఎటువంటి పోషకాహారం అందించాలో వివరిస్తూ ర్యాలీ చేశారు.

ఉపాధి హామీ పనుల మస్టర్లలో అవకతవకలు


ఉపాధి హామీ సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న పీడీ మధుసూదనరావు

పాలతోడు ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

మండపేట, సెప్టెంబరు10: మండలంలోని 12 పంచాయతీల పరిధిలో 2023-24 ఏడాదికి ఉపాధి హామీ పథకంలో చేసిన రూ.8.13కోట్ల పనులకు మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. జిల్లా ఉపాధి హామీ పీడీ మధుసూదనరావు, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 12 గ్రామాలకు సంబంధించిన పనుల్లో గుర్తించిన లోపాలను ఉపాధి హామీ ఆడిట్ సిబ్బంది వెల్లడించారు. పలు గ్రామాల్లో మస్తర్ల మాయాజాలంబయట పడింది. పాలతోడులో ఒకే కుటుంబానికి రెండేసి జాబ్‌కార్డులు జారీ చేసినట్లు రుజువు కావటంతో పాలతోడులో ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు పీడీ వెల్లడించారు. వెలగతోడులో ఫీల్డ్‌అసిస్టెంట్ సామాజిక తనిఖీ పేరిట ఉపాధి కూలీలు వద్ద రూ.200వంతున వసూలు చేస్తుందని, గల్ఫ్ దేశంలో ఉన్న వారికి జాబ్‌కార్డులు జారీచేసి నగదు కాజేస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని పీడీ వారికి హామీ ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై పలు చోట్ల ఫిర్యాదులు అందాయి. ఆడిట్‌లో వెల్లడైన విషయా లను కలెక్టర్ దృష్టికి తీసువెళ్లి చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. ఎంపీడీవో సత్యనారాయణ. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఐదంరాజు, విజిలెన్స్ అధికారి బీమేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ఒ.రామకృష్ణ, మండల ఇంజనీరింగ్ అధికారి నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ దాసు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి : కలెక్టర్

మామిడికుదురు, సెప్టెంబరు 10: గోదావరికి వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. పాశర్లపూడి కరకట్ట దిగువ ఉన్న అప్పనపల్లి కాజ్‌వేను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. వరద ప్రభావంతో కాజ్‌వే మునిగితే రాకపోకలు నిషేధించాలని, లంక గ్రామాల ప్రజలు ఉచ్చిలివారిపేట మీదుగా ప్రయాణాలు సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వరద పరిస్థితిని అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డితో చర్చించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.మృత్యుంజయరావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కాజ్‌వే వద్ద రక్షణ చర్యలు..

వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కాజ్‌వేకు ఇరువైపులా రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఎర్ర జెండాలు పాతుతున్నారు. బుధవారం ఉదయానికి కాజ్‌వే మునుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. లంక గ్రామాలైన అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం ప్రజలు కాజ్‌వే పైనుంచి కాకుండా ఉచ్చిలివారిపేట మీదుగా రాకపోకలు సాగించాలని అధికారులు సూచిస్తున్నారు.

వరదను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

అల్లవరం, సెప్టెంబరు10: పెరుగుతున్న వైనతేయ వరదను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తహశీల్దారు వీవీఎల్ నరసింహం, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ సూచించారు. తహశీల్దారు కార్యాలయంలో వరద జాగ్రత్తలపై సమావేశం జరిగింది. వరద పెరుగుతున్నందున ఓడలరేవు, కరవాక, బెండమూర్లంక-గోగన్నమఠం వైనతేయ రేవుల్లో పడవలపై రాకపోకలను నిలిపివేయాలని నిర్ణయించారు. ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, ఏవో ఎన్వీవీ సత్యనారాయణ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు జి.సంపత్, జి.స్వామి, మండల పశువైద్యాధికారి మేడిద నారాయణరావు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ

ఆలమూరు, సెప్టెంబరు10: చెముడులంక జడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థులు కంప్యూటర్ ప్రింటర్‌ను మంగళవారం స్కూల్ హెచ్‌ఎంకు అందజేశారు. ఇటీవల స్నేహితుడు మృతి చెందడంతో ఆయన పిల్లలకు చదువుకు రూ.60వేలు డిపాజిట్ చేశారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం


చంద్రబాబు,పవన్ చిత్రపటాలకు గుమ్మడికాయల దిష్టితీస్తున్న మహిళలు

గుమ్మడికాయలతో దిష్టి తీసిన మహిళలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 10: మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం తెలుగుమహిళా నాయకురాలు జాస్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు టీడీపీ మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం గుమ్మడికాయలతో దిష్టితీసి పగలకొట్టారు. విజయవాడ వరద బాధితులకు సత్వరం ఆహారం, తాగునీరు, వైద్యసౌకర్యాలు, తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసి విజయవాడ వరదల నుంచి త్వరగా కోలుకునే సాధారణ స్థితికి సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మహిళలు కొనియాడారు. మంత్రి సుభాష్ నియోజకవర్గం నుంచి భారీగా ఆహార పదార్థాలు, నిత్యావసరాలు విజయవాడ తీసుకెళ్లి బాధితులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎం.దుర్గమ్మ, బాల లక్ష్మి, ఇంజరపు రాజేశ్వరి, తుమ్మలపాటి విజయలక్ష్మి, ఆర్.మంగవేణి, ఆర్పీలు, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్న ప్రధాన డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, రాష్ట్రంలోని కూటమి నేతలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, మోదీ ప్రభుత్వం చేసే ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు మావూరి భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వివిధ యూనియన్ల నాయకులు పార్వతి, రత్నకుమారి, దైవకృప, అంకం కనకదుర్గ, వెంకటరమణ, భువనేశ్వరి, శ్రీను, తాడి శ్రీరామమూర్తి, చిక్కం దుర్గారావు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

పి.గన్నవరం, సెప్టెంబరు10: గోదావరి వరద ఉధృతంగా పెరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో బుధవారం గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామాల పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణ తెలిపారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలపై చర్చ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: అమలాపురం కచేరీచావిడి భవనంలో మంగళవారం వీఆర్వోల సంఘ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. దంగేటి వీరరాఘవులు, వీరబాబు, రాజేష్, వినోద్, సుజాత, ప్రకాష్, వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

వేదసభ

అంబాజీపేట, సెప్టెంబరు10: ఇరుసుమండలో ప్రముఖ సిద్ధాంతి ఆకెళ్ళ శ్రీవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో వేదసభ నిర్వహించారు. శ్రీపాద మాణిక్యావధాని, ఆకెళ్ళ నరసింహసోమయాజీ వేదాల విశిష్టతను వివరించారు.

ఉచిత కంటి శుక్లాల చికిత్సా శిబిరం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు10: చినకోరుమిల్లిలో సీతారామ కాపు కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి శుక్లాల చికిత్సా శిబిరం నిర్వహించారు. బలుసు కనకదుర్గ వెంకట సత్యసుబ్రహ్మశర్మ జ్ఞాపకార్థం లంకవిజయ, మెహర్‌చంద్, బలుసు, భమిడిపాటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ ప్రారంభించారు. చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల నిపుణులు వారం రోజులు వైద్యసేవలందించి అవసరమైన మందులు, కళ్లజోళ్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల18వరకు కంటిశుక్లాలు ఉన్నవారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. మేజర్ ఆపరేషన్ అవసరమైన వారికి చెన్నైలో శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు విజయ, మోహర్‌చంద్ లంక తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి కొండలరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బైరంరాజు, ఆప్తమాలజిస్ట్ డా. ఐశ్వర్య సిబ్బంది, వెంకటేష్, సత్యరాజ్ పాల్గొన్నారు.

13 నుంచి విజయవాడలో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

అమలాపురంటౌన్, సెప్టెంబరు10: చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల13,14తేదీల్లో విజయవాడలోని శ్రీశేషసాయి కల్యాణ వేదికలో రాష్ట్రజాతీయస్థాయిలోని పేరొందిన వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలు, ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి కె.పెద్దిరాజు తెలిపారు. ఈప్రదర్శన జాతీయ స్థాయిలో పేరొందిన చేనేత వస్త్ర ఉత్పత్తులతో పాటు సిల్క్ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు.రాష్ట్రంలోని ప్రధాన చేనేత సహకార సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను అమ్మకాల ప్రదర్శనకు ఉంచుతారన్నారు. జిల్లాలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, మాస్టర్ వీవర్లు ప్రదర్శనలో పాల్గొనాలని పెద్దిరాజుకోరారు.

రిష్వంత్‌రాయ్‌కు లోకేశ్ అభినందన



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో తెలుగుయువత తరపున సేవలు అందించిన రామచంద్రపురానికి చెందిన తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిష్వంత్‌రాయ్‌ను మంత్రి లోకేష్ అభినందించారు. రిష్వంత్‌రాయ్ కార్యకర్తలతో కలసి తెలుగుయువత చేసిన కార్యక్రమాలు మంగళవారం మంత్రి లోకేష్‌ను కలిసి వివరించారు. దీంతో రిష్వంత్‌రాయ్‌ను లోకేష్ అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏలియన్ రొమ్యులస్

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 10: 216 జాతీయ రహదారి ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో కొండాలమ్మచింత-ముక్తేశ్వరం రోడ్డు క్రాస్‌వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది బందా వెంకటసుబ్రహ్మణ్యేశ్వరరావు ఎన్‌హెచ్ అధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. హైవే క్రాసింగ్ వద్ద బ్లింకర్ లైట్లు గాని, వేగ నిరోధక చర్యలు గానీ లేకపోవడంతో అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు స్పందించి ఆ ప్రాంతాలను పరిశీలించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

13న ముమ్మిడివరంలో జాబ్ మేళా

ముమ్మిడివరం, సెప్టెంబరు 10: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో ఈనెల13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మంగళవారం తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 350కుపైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, బి.ఫార్మశీ, ఎం.ఫార్మశీ అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు రాజేంద్రప్రసాద్ సెల్ 8247645389లో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు ఆధార్, బయోడేటా, ఐడీ అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

బీజేపీ సమావేశం

మలికిపురం, సెప్టెంబరు 10: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. మంగళవారం చింతలమోరిలో ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గెడ్డం నాగబాబు ఇంటి వద్ద కాపిశెట్టి కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ సభ్యత్వాలను అత్యధికంగాచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్డీఏప్రభుత్వ హయాంలో జరుగుతున్న కార్యక్రమాలను ప్రతీ ఇంటికీ తీసుకువెళ్లాలన్నారు. పాలూరి సత్యానందం, మాలే శ్రీనివాసనగేష్, అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు, దొడ్డా నాగబాబు పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 10: గొల్లవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మౌనిక కంటి పరీక్షలు నిర్వహించి పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంచెం బాలకృష్ణ, చీకట్ల ఏసు తదితరులు సేవలందించారు.

కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 10: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రి నర్సుల యూనియన్ డిమాండు చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇటీవల జారీచేసి అమలు చేస్తున్న జీవోనంబరు 115ను తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండు చేశారు. ప్రభుత్వ జీవోను నిరసిస్తూ మంగళవారం కాంట్రాక్టు నర్సులంతా విధులను బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం తక్షణం 115 జీవోను రద్దు చేయాలన్నారు. తమకు న్యాయం జరగని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పుష్పవతి, కె.వేదమణి, ఎం.సుజాత, దుర్గాబాయి, పుష్పవతి, శివపార్వతి, శిరీష, లోవలక్ష్మి, భవానీ, రాజేశ్వరి, ఫిజియోథెరపీ కవిత, ఓటీ అసిస్టెంట్ శాంతి పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణా దినోత్సవం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: జనక ల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, ఏరియా ఆసుపత్రి జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం సంయుక్త భాగస్వామ్యంతో మంగళవారం ఆత్మహత్యల నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక పరంజ్యోతి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో డాక్టర్ పి.సౌమ్య ఆధ్వర్యంలో ఆత్మహత్యలతో ఆయా కుటుంబాలకు జరిగే నష్టాలను వివరించారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడేవారిని గుర్తించే విధానాలను సౌమ్య వివరించారు. తొలుత నల్లవంతెన వద్ద ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డాక్టర్ జాన్‌పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

మామిడికుదురు/పి.గన్నవరం, సెప్టెంబరు 10: వరద బాధితులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన రెండో రోజు కూడా సాగింది. మంగళవారం ఆయన జక్కంపూడి కాలనీ ఫ్లాట్ నంబరు 174లో పర్యటించి బాధితులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడికుదురు మండల నాయకులు జాలెం శ్రీనివాసరాజా, తుండూరి బుజ్జి, బళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీకి రూ.2.06లక్షల సాయం

అంతర్వేది, సెప్టెంబరు 10: గొంది గ్రామంలో ఇటీవల హైటెన్షన్ వైర్లు తగిలి విద్యుత్ ప్రమాదానికి గురైన బర్రే దుర్గాభవానీకి సఖినేటిపల్లి మండల ఎస్టీయూ సంఘ సభ్యులు రూ.1,41,270 సేకరించారు. గొంది పాఠశాల ఉపాధ్యాయులు రూ.61వేలు, మోరి పాఠశాల విద్యార్థులు రూ.4,500 సేకరించి మొత్తం రూ.2,06,770 ఆర్థికసాయం ఆ కుటుంబానికి అందించినట్లు ఎస్టీయూ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ నరహరశెట్టి సత్యనారాయణ, జిల్లా అసోసియేటీవ్ అధ్యక్షుడు ఉండపల్లి సత్యనారాయణ, కేవీ నాగేశ్వరరావు, ఉండపల్లి గిరిబాబు, జీవీవీ కృష్ణప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహ అగ్నికుల క్షత్రియుల సంఘం ఆధ్వర్యంలో రూ.25,900 దుర్గాభవానీకి అందించినట్లు సంఘ అధ్యక్షుడు పీఎస్ స్వామి తెలిపారు.

పి.గన్నవరం సీఐగా రుద్రరాజు



అంబాజీపేట, సెప్టెంబరు 10: గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు అన్నారు. పి.గన్నవరం సీఐగా ఆయన అంబాజీపేట సర్కిల్ స్టేషన్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మారేడుమిల్లి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అల్లవరం, ఉప్పలగుప్తం, అయినవిల్లి, అంబాజీపేటలో ఆయన ఎస్ఐగా పనిచేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, సెప్టెంబరు 10: బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహణ పనుల కోసం కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన టౌన్, జీకే పోర, వేట్లపాలెం, చిర్రయానాం, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు, కొప్పిగుంట, పండి, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొల్లేటిమొగ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

బాలికపై వృద్ధుడు అత్యాచారయత్నం

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

రాజోలు, సెప్టెంబరు 10: రాజోలు మండలంలో ఒక గ్రామంలో 9ఏళ్ల బాలికపై 72ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలివి. ఈనెల7వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నాలుగో తరగతి చదువుతోన్న బాలిక గ్రామంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటుంది. గ్రామానికి చెందిన వృద్ధుడు సత్యనారాయణ బాలికకు చాక్‌లెట్ ఇస్తానని ఇంట్లోకి తీసుకువెళ్లాడు. అనంతరం తలుపులు వేసి అత్యాచారం చేయబోయ్యాడు. బాలిక స్నేహితులు తలుపులు కొట్టగా వృద్ధుడి అక్కడి నుంచి పారిపోయ్యాడు. బాలిక సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిత్య శ్రామికుడు ప్రధాని నరేంద్రమోదీ

మామిడికుదురు, సెప్టెంబరు 10: దేశాన్ని అన్నివిధాలుగా అగ్రగామిగా నిలబట్టేందుకు ప్రధాని మోదీ నిత్య శ్రామికుడిగా పనిచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, సభ్యత్వ ప్రముఖ్ పాలూరి సత్యానందం పేర్కొన్నారు. గెద్దాడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలశాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. అడబాల సత్యనారాయణ, మోకా సుబ్బారావు, గాడి సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు, నన్నేసా హుస్సేన్, షంషాసాదిక్, వేగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకున్నారు

మామిడికుదురు, సెప్టెంబరు 10: వర్షాలకు అధ్వానంగా తయారైన మామిడికుదురు నుంచి లూటుకుర్రు వెళ్లే రోడ్డును స్థానిక యువకులు శ్రమదానంతో బాగు చేసుకున్నారు. యువకులు సమష్టిగా కలిసి రోడ్డుపై ఏర్పడిన గోతుల్లోని వర్షం నీరు బయటికి పోయేలా మార్గం చేసుకున్నారు. బురద పేరుకున్న చోట మరమ్మతులు చేపట్టి రోడ్డును బాగు చేసుకున్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్రేయపురం, సెప్టెంబరు10: వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉందని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి చెప్పారు. తహశీల్దారు కార్యాలయంలో కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గ్రామాలను వదలకుండా ప్రజలను అప్ర మత్తం చేయాలన్నారు. లంకరైతులను గోదావరి దాటి వెళ్లకుండా టాంటాం ద్వారా హెచ్చరించాలన్నారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

రేపు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10: ఐటీసీ లిమిటెడ్, అమర్‌రాజా గ్రూప్ ఇండస్ట్రీస్, రేన్ ఇంజన్ వాల్వ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఐటీఐ అభ్యర్థులకు ఈనెల12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులతో పాటు ఇటీవల చివరి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు ఈఉద్యోగాలు పొందేందుకు అర్హులన్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 12వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాట్స్‌మెన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంట్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, మెషనిస్ట్, ఆర్‌అండ్‌ఏసీ, వెల్డర్, మెకానికల్, డీజిల్ తదితర విభాగాల్లో 400ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ వర్మ తెలిపారు. ఐటీఐ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.